

# మామిడి చెట్టు - మాధవీలతా


ఇచ్ఛాపురపు రామచంద్రం

**రంగనాథం - వీధి వాకిలిలో వాలు కుర్చీలో మేనువాల్చి నిస్త్రాణగా ఇలా కళ్లు మూసుకున్నాడో లేదు నుదుటి మీద గాయం ఎవరో కెలికినట్లే కలుక్కుమంది.**

అంత పెద్దాయనా "అబ్బా!" అంటూ బాధతో మూలగకుండా నిలవరించుకోలేక పోయాడు. కళ్లు తెరవకుండా ఉండలేకపోయాడు. కళ్లు తెరిచేసరికి... ఎదురుగా... దెయ్యం లాంటి మామిడి చెట్టు, వెక్కిరిస్తున్నట్లూ వేళాకోళం చేస్తున్నట్లే. పుండు మీద కారం పూసినట్లు ఆయనకు ఒక్కసారి అపరిమితమైన ఆగ్రహం వొచ్చేసింది.

"రేపే నరికించి పారెయ్యాలి దీనిని..." క్రోధంతో పైకే గొణిగాడు.

ఒక్కసారి - చల్లగా... పిల్ల తెమ్మెర. సాయంత్రపుగాలి మహాసాంత్వనగా అనిపించి ఆయన మళ్లీ కళ్లు మూసుకుని కుర్చీలో వెనక్కి




వాలాడు. కొన్ని నిముషాలకే ఆ చల్లని గాలి సుఖానికి - మెలకువకీ, నిద్రకీ మధ్య ఉండే మత్తులాంటి స్థితిలోకి జారిపోయాడు... తను వొట్టి శీఘ్ర కోపి అని తనకుతానే నిరూపించుకుంటూ.

"నాన్నగారూ! నమస్కారం-" మనిషి కంఠం లోంచి వొచ్చిన మాటలలా లేవవి. గాలి గుసగుస లాడినట్లో... ఆకులు గలగలలాడినట్లో... కొమ్మలు ఒకదాని కొకటి వొరుసుకుని శబ్దం చేసినట్లో ఉన్నాయి. ఐనా స్పష్టంగానే ఉన్నాయి.

"ఎవరది?" కళ్లు తెరవకుండానే అడిగాడు రంగనాథం.

"నేను... మీ మామిడి చెట్టుని..."

ఆయన ఆశ్చర్యపోలేదు. త్రుళ్లి పడలేదు. మామిడి చెట్టేమిటి, మనిషిలా మాట్లాడడమేమిటి.. నమస్కారమనడమేమిటి... నాన్నగారూ అని పిలవడమేమిటి... అనే అస్తి శాస్తి విచికిత్సకు లోనుకాలేదు. ఆయన నావరించిన చల్లని మత్తు మత్తు అంత మహత్తరమైనదేమో, లేదా... మామిడి చెట్టుని అనగానే ఆయనకు మళ్లీ వచ్చేసిన కోపపు తీవ్రతతో - చిన్న చిన్న సందేహాలకు స్థానమే లేకపోయిందో- "ఎందుకు దాపురించావ్?" కసిరా డాయన.

"నన్ను నరికించేస్తానంటేనూ... ప్రాణ భిక్ష పెట్టమని వేడుకుందామని..."

"నిన్ను నరికించి తీరతాను రేపే... రేపే నిన్ను నరికించి పోగులు పెట్టిస్తాను." గాయం మళ్లీ చెలరేగి పెట్టిన బాధతో ఆయన ఆగ్రహం రెల్లుగడ్డి మంటలా ఒక్కసారి ప్రజ్వరిల్లి - శపథం చేస్తున్నట్లే అన్నా డావేశంగా.

"కొంచెం శాంతించి ఆలోచించండి. మీరేమో పిల్లా పాపా కలిగినవారు. కాసే పూసే చెట్టుని పాప చింతనయినా లేకుండా నిలవునా నరికిస్తారా?" వేడుకుంది అశోకం.

"నరికిస్తానూ... నరికిస్తానూ... నరికిస్తాను. నరికించి తీరతాను..." నుదుటి నరం మీద గాయం కేరేల్ మనగా భీషణంగా అరిచాడాయన.

"న్యాయం కాదేమో? మీరు తండ్రీ - నేను బిడ్డా. ఎందుకంటే... ఎలాగంటే... మీరే మీ చేతులతోనే నన్ను నాటారు. మరిచిపోయారా?" జ్ఞాపకం చేస్తున్నట్లే అంది.

"అదే...నిన్ను నాటడమే నేను చేసిన తెలివితక్కువపనీ, తొందర పనీ. అప్పుడు బుద్ధి గడ్డితిని... ముందు చూపులేక... నా పీకల మీదకి నేనే తెచ్చుకున్నాను."

"అదేమీ?" రెమ్మలు గుసగుసలాడినట్లే వచ్చిందా ప్రశ్న.

"ప్రహరీకి లోపలే ఐనా - వీధి గోడకి దగ్గరగా వేశాను నిన్ను. రోడ్డున పోయే వారికి నీ కాయలు ఆకర్షణా, ఆశా. ఆ తుంటరులు రాళ్లు విసరడం. తుంటెని కొడితే పళ్లు రాల్తాయో రాలవో కానీ ఆ రాస్కెల్స్ నీ కాయల కోసం విసిరిన రాళ్లు మాత్రం మాకు తగులుతున్నాయి. చూస్తున్నావుగా నువ్వే నీ కళ్లతో ఈ గాయాన్ని? ఉదయం ఏ రాలుగాయో విసిరిన రాయి వాకిట్లో సూర్య నమస్కారాలు చేసుకుంటున్న నాకు తగిలింది. గుడ్డిలో మెల్లగా నుదుటికి తగిలింది కాని... కాస్త అటయితే కన్నే పోయేది...'

ఆయన ప్రవాహం ఆగకుండానే అడ్డం పడింది నవమల్లిక. "నా మూలాన మీకు దెబ్బ తగిలినందుకు చాలా చింతిస్తున్నాను. బాధపడు తున్నాను. క్షమాపణలు వేడుకుంటున్నాను." తాను రోజూ తింటున్న ఎన్నెన్నో రాళ్ల దెబ్బల సంగతిని వొదిలేసి -" ఏపుగానూ ఎత్తుగానూ ఎదిగాను కదా మీ సంరక్షణలో? రోడ్డుమీద పోయేవారికి నా కాయలూ, నాకేమో వాళ్లూ కనిపించక తప్పదు మరి. ఎల్లేరమ్మ కళ్లెప్పుడూ ఎండు చేపల మీదే అన్నట్టు రోడ్డు మీద పోయే వాళ్లందరి కళ్లూ నా కాయల మీదే! కళ్లతో సరి పెడితే బాగానే ఉండేది. కళ్లూ రాళ్లూ కూడా విసురుతారు కొందరు. దయచేసి...."

"దయాలేదు, గియాలేదు. నిన్ను కొట్టించి తీరతాను రేపు. - ఊఁ.... పోనీ... ఓ పని చెయ్... నువ్వు కాయలు కాయడం మానెయ్. అప్పుడు రోడ్డుమీద రౌడీ వెధవలు నీ మీదకి రాళ్లు విసరరు, అవి మాకు తగలనూ తగలవు." వెటకారించా డాయన. ఎలక్కి ప్రాణ సంకటం పిల్లికి చెలగాటమే కదా?

"కాయడమూ మానడమూ నా వశంలోనూ, అధీనంలోనూ ఉండేదా? అది - ప్రకృతి కదా? మనుషులకైతే సంతు కలగకుండా నియంత్రణా మార్గాలున్నాయి. కాని - చెట్లని కాయకుండానూ పూయకుండానూ అరికట్టే ఉపాయాలున్నట్లు నాకైతే తెలీదు. నాకు తెలిసిందెంత లెండి..."

"నీతో ఒక న్యూసెన్సా?..." ఏదో అనబోయాడు రంగనాథం.

"అదికాదు. నా కాపు ఉండే దెంత కాలమని? మహాఐతే మూణ్నెల్లు అంతేగా?" ఆ మాత్రం భరించలేరా అంటున్నట్లుం దరవిందం.

"ఉత్తరోజుల్లోనూ ఆకులు వాకిలంతా రాలుస్తూ ఉద్దరిస్తూంటావ్‌గా? ఆకులు ఎత్తి పోయలేక చేతులు పడిపోతున్నాయో అని పనిమనిషి, ఇంటి ఇల్లాలు ఇద్దరికిద్దరూ ఒకటే నస. అయ్యో పోనీలే... నీడగా ఉంటుందని నాటితే నువ్వు మమ్మల్ని నానా చికాకులూ పెట్టిస్తున్నావ్. ఏ రౌడీ వెధవో విసిరిన రాయి ఇంట్లో ఎవరి బుర్రకో కంటికో తగిలితే ఇంకేమన్నా ఉందా? కంటే కర్మకాని పెంచుకునే ప్రారబ్దమా అని... నిన్ను ఉండనివ్వనేల? మేము దెబ్బలు తిననేల?' తన నిర్ణయం ఎంత తిరుగు లేనిదో తన కంఠంలోనే ప్రదర్శించాడాయన.

"రౌడీలంటే గుర్తొచ్చింది. మన మాధవీలత లేదూ?" చటుక్కున అంది చూత వృక్షం ఏదో గుర్తొచ్చినట్లు.

'లేకేం? ఉంది. మహ చక్కగా దిమిశాదుక్కలా ఉంది. గజ్జల గుర్రంలా ఉంది. పెళ్లి కెదిగిన నా పీకల మీదా గుండెల మీదా కూర్చుని మరీఉంది' వస్తున్న సంబంధాలడుగుతున్న కట్నపు మూటలు మెదిలి మనసు మండిపోయింది. కొడుక్కి కట్నం తీసుకోడం ఎంత బలేగా మజాగా అనిపించిందో - కూతురికి కట్నం ఇవ్వవలసి వస్తూందనేసరికి అంత బాధగా మంటగా ఉందా మధ్యతరగతి మహానీయుడుకి.

"మాధవీలత చాలా మంచమ్మాయి. మహా బుద్ధిమంతురాలు. చూడచక్కనిది..."

"కాక? అది నా కూతురు" గర్వం తొంగి చూసింది మాటల్లో.

"కానీ... వొట్టి గొడ్డుకేనా అరుపులు తప్పవన్నట్లు అంత మంచి అమ్మాయైనా మాధవీలత గేటులో నిలుచుంటే రోడ్డుమీద పోయే రౌడీలూ రోమియోలూ నా కాయల వేపులా ఎలా ఎంత ఆశగా చూస్తారో కొరుక్కు తినేసే లాగే.."

"ఆ!" అదిరిపడ్డాడు. చేదు మింగుతున్నట్లూ ఆముదం తాగుతున్నట్లూ ఐపోయింది ముఖం.

"ఎలాంటి తేలిక మాటలంటారని ఆ జులాయిలు! ఆ నీచనికృష్టపు వెధవ మాటలకు నాకే వొళ్లు మండిపోతూ వెర్రి కోపమొచ్చేస్తూంటుంది. కొమ్మలతో వాళ్ల వీపులు బాదేయ్యాలనిపిస్తుంది. అలాంటి కుళ్లు కుత్సితపు అసభ్యం మాటలు కూస్తారు మరి."

"ఔనట... ఆవిడా అందీమధ్య ఇదే మాట. పోకిరీ వెధవలు.. పనీపాటా ఉండక... తిన్న దరక్క.. వొళ్లు కొవ్వెక్కి..." పళ్లు పటపట కొరికాడు - పేదవాడి కోపం పెదవికి చేటయితే ముసలివాడి ఆవేశం పళ్లకి చేటు కావొచ్చునని సూచిస్తున్నట్లు.


"గడప దాటకపోయినా... హద్దు మీరకపోయినా... మాధవీలత ఆడపిల్ల అయినందువల్ల కాబోలు ఆమెకీ, నేను గేటు లోపలే ఉన్నా, ప్రహరీ గోడకిటువేపే కాసినా మామిడి చెట్టునయిందువల్ల నాకూ మాటల పోట్లూ రాళ్ల దెబ్బలూ తప్పడం లేదు." మా ఇద్దరి పరిస్థితీ ఒకేలా లేదూ? అని అడుగుతున్నట్లే అంది మామిడి. నిజమే అనిపించిందాయనకి. మామిడి కాయను చూసినా... మంచి అమ్మాయిని చూసినా ఓ రాయో... రాయిలాంటి మాటో విసరకుండా ఉండదు వెధవలోకం.

"మేము ఏ పాపమూ ఎరుగం. ఏ నేరమూ చేయం. ఎవరి జోలికీ పోము. ఐనా మా వల్ల మా తండ్రి గారికి మనస్తాపమే. ఒక విధంగా నా పరిస్థితే మెరుగేమో. ఏ పండక్కో పబ్బానికో కొమ్మలు విరిచినా.. అదో పెద్ద బాధ కాదు. నాకు రాళ్లదెబ్బలూ కాపు కాలంలోనే. ఆడపిల్ల అలాకాదే? నిత్యమూ పోకిరీల పోరే." జాలి పడింది.

ఒక్క క్షణం అవాక్కయిపోయాడాయన. ఐతే అంతలోనే ఆయనలో మధ్య తరగతి మేకపోతు గాంభీర్యం తోక ఝుళిపించి... ఓటమి నొప్పుకోనని ఓండ్ర పెట్టడంతో-

"దానిదేముంది? పెళ్లి చేసి పంపించే వరకే కదా..." అన్నాడు మనసుని మోసగించుకుని.


"ఔను. అది నేననేదీను. అమ్మాయికి... మాధవీలతకు.. పెళ్లయ్యే వరకూ నన్నూ బతకనివ్వండి. అప్పుడు ఒక్కసారే రెండు న్యూసెన్సులూ




వొదిలిపోయి మహదానందంగా ఉండొచ్చు." రుద్ధ కంఠం లాగే ధ్వనించాయా మాటలు.

వీధి వాకిట మామిడి చెట్టు... ఇంట్లో మాధవీలత... మామిడి చెట్టూ మాధవీలతా ఇద్దరికిద్దరూ తలనొప్పే తండ్రికి. మామిడి చెట్టుని నరికించడానికి కొంచెం ఖర్చు, మాధవీలత పెళ్లికి ఎక్కువ ఖర్చు.

"నీడనిస్తాననీ.. కాయలూ పళ్లూ ప్రసాదిస్తాననీ.. వంట చెరకు కలపా అందిస్తాననీ... కోయిల కూతలు వినవొచ్చుననీ... పర్యావరణ రక్షణ కల్పిస్తాననీ నేనేమి వ్యాసం వినిపించబోను మీకు. కొన్నేళ్లుగా మీతో పాటు ఇంట్లో ఉండటం వలన పెరిగిన మమత కొద్దీ, మహానుభావుడు జగదీశ్ చంద్రబోస్ చెప్పినట్లు - చెట్టునయినా - నాకూ ప్రాణమూ మనసూ మమకారమూ రాగద్వేషాలూ




భయ సంతోషాల వంటి భావాలుండ బట్టి - మిమ్మల్నొకటి ప్రార్థించదలుచుకున్నాను. నాకూ ఒక మనసుంది. నా మనసుకీ ఒక కోరికుంది-"

"ఏమిటో అది?"

"మధవీలత కళ్యాణ మంటపానికి నా ఆకులు తోరణాలు కావాలని. నా యీ చిన్న కోరికని.. సెంటిమెంటుని... దయతో ఆలోచించండి. అనుగ్రహించండి" దుఃఖిస్తున్నట్లే అంది మామిడి. "నాకు... యీ మామిడి చెట్టుకి.. సోదరి మాధవీలత కళ్యాణ మహోత్సవాన్ని కళ్లారా చూడాలని కోరిక..."

రంగనాథం హృదయం ద్రవించడమే కాదు, కనువిప్పు కలిగింది. అతను తన మనసుని అట్టే బయట పెట్టకుండానే "లేదులే.. నిన్ను నరికించనులే... ఇంతగా ప్రాధేయపడుతున్నావుగా? ఐనా... మాధవీలత పెళ్లి చెయ్యాలంటే ఈ ఇంటిని అమ్మెయ్యవలసివచ్చేట్టుంది సుమా! అప్పుడు మాత్రం నాకూ ఒక మనసున్నాది. మీరీ ఇల్లు అమ్మేసి వెళ్లిపోకండంటూ అడ్డం పడకేం? ప్రస్తుతానికి నేను నిన్ను నరికించనులే..." అన్నాడు కొంచె జాలీ మమత నిండిన కంఠంతో.

"కృతజ్ఞురాలిని..." సెలవు తీసుకుంటున్నట్లు ఆకులు గలగలలాడిస్తూనూ... కృతజ్ఞతాసూచకంగా చల్లనిగాలి కెరటమొకటి విసిరింది మామిడి చెట్టు.

అదేక్షణంలో - "ఏమిటి? మీలో మీరే ఏదో గొణుక్కుంటున్నారు?" అంటూ అక్కడి కొచ్చిందాయన భార్య మంచినీళ్లు పట్టుకుని. "దెబ్బ - బాధ పెడుతూందా?"

"లేదు. ఇప్పుడు నాకే బాధా లేదు. ఎందుకంటే... ఒక భ్రమ ఒక సత్యాన్ని చెప్పి... నీకర్థం కాదులే." అంటూ కళ్లు తెరిచి నీళ్ల చెంబందుకున్నాడు రంగనాథం. ●